## క్లుప్తంగా

### అమ్మవారికి సారె సమర్పణ



భవానీపురం(విజయవాడపశ్చిమ):విజయవాడ రూరల్ మండలం జక్కంపూడి వైఎస్సార్ కాలనీలోగల శ్రీవిజయదుర్గాదేవి దేవస్థానంలో నిర్వహిస్తున్న దసరా ఉత్సవాల్లో భాగంగా బుధవారం అమ్మవారు అన్నపూర్ణాదేవి అలంకారంలో దర్శనం ఇచ్చారు. వైఎస్సార్ సీపీ మైలవరం ఇన్‌చార్జ్ జోగి రమేష్ విచ్చేసి అమ్మవారిని దర్శించుకుని సారె సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జగన్మాత శ్రీకనకదుర్గమ్మ సకల మానవాళి క్షుద్బాధను తీర్చే అన్నపూర్ణా దేవిగా అవతరించిన ఆ తల్లికి సారె సమర్పించటం అదృష్టంగా భావిస్తున్నాని అన్నారు. విజయవాడ రూరల్ మండలం పార్టీ అధ్యక్షుడు బయ్యారపు రవికిషోర్, ఎంపీటీసీలు కొరగంజి సత్యనారాయణ, షేక్ సైదాబీ హిమవలి, కాలనీ నాయకులు నక్కా ప్రభుదాస్, మారపాక రాంబాబు, కుంభా నాగరాజు, గద్దల లాజర్, విన్నపాల రంగారావు, పైడూరుపాడు సర్పంచ్ వేముల సీతారామయ్య, టీఎల్ రాజు తదితరులు పాల్గొన్నారు.

### భక్తులకు అందుబాటులో తాగునీరు ఉండాలి

పటమట(విజయవాడతూర్పు): ఇంద్రకీలాద్రి అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు నిరంతరం వాటర్‌పాయింట్లు అందుబాటులో ఉండాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. నగర పర్యటనలో భాగంగా ఆయన బుధవారం భవానీఘాట్, పున్నమిఘాట్, కృష్ణవేణి ఘాట్, రథం సెంటర్, కేటీ రోడ్, మిల్క్ ప్రాజెక్ట్, సీవీఆర్ ఫ్లైఓవర్ ప్రాంతాలలో పర్యటించారు.

### నయనానందకరంగా నృత్యాలు

విజయవాడ కల్చరల్: దేవదాయ ధర్మాదాయ శాఖ, దుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో కనక దుర్గానగర్‌లోని కళావేదికమీద బుధవారం ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు నయనానందకరంగా సాగాయి. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కళాకారులు అమ్మవారికి నృత్య నీరజనాలు అందించారు. చల్లపల్లికి చెందిన వెంకటరమణ తాళం భజనతో కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. అన్నమయ్య, రామదాసు, త్యాగరాజ స్వామి, అమ్మవారిమీద వాగ్గేయకారులు రచించిన కీర్తనలకు నృత్యాలను అభినయించారు. వరంగల్‌కు చెందిన లక్ష్మీనారాయణ భక్త కుచేల హరికథను గానం చేశారు. సైదా, రామకృష్ణ గంగాధర్ నిర్వహించారు. కళాకారులకు నిర్వాహకులు జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందజేశారు.

### వైఎస్సార్ సీపీ మున్సిపల్ విభాగ రాష్ట్ర కార్యదర్శిగా పైడాడ

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ):వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ విభాగ రాష్ట్ర కార్యదర్శిగా నగరానికి చెందిన పైడాడ శ్రీనివాసరావు నియమితులయ్యారు. ఈ మేరకు ఆ పార్టీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలంపల్లి శ్రీనివాసరావును ఆయన కార్యాలయంలో బుధవారం కలిసి కృతజ్ఞతలు తెలిపారు. వెలంపల్లి శ్రీనివాసరావు పైడాడ శ్రీనివాసరావుని శాలువాతో సన్మానించారు. కూటమి ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై పోరాడాలని, పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు.



విద్యుత్ వెలుగుల్లో ఆలయ ముఖద్వారం



అన్నప్రసాదం స్వీకరిస్తున్న చిన్నారులు

# కోలాహలంగా మహోత్సవాలు



ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో దసరా మహోత్సవాలు కోలాహలంగా సాగుతున్నాయి. వేలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కుబడులు చెల్లించుకుంటున్నారు. భక్తులతో కొండంతా నిండిపోయింది. తెల్లవారుజాము నుంచే క్యూలైన్లు కిలకిటలాడుతూ కన్పించాయి. ఉత్సవాల్లో భాగంగా నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకుంటున్నాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కళాకారులు పలు అంశాలకు నృత్యాలు ప్రదర్శించారు.

–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ



నృత్యాలు ప్రదర్శిస్తున్న కళాకారులు





శ్రీచక్ర పూజ నిర్వహిస్తున్న అర్చకులు



క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు

# గాయత్రిదేవిగా మహాలక్ష్మీ అమ్మవారు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ):మహాలక్ష్మీ అమ్మవారు బుధవారం గాయత్రిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. తెల్లవారుజాము నుంచి పెద్ద ఎత్తున భక్తులు ఆలయానికి తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్నారు. గాయత్రిదేవి అలంకారంలో మహాలక్ష్మీ అమ్మవారిని నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి దర్శించుకున్నారు. ఆలయ కమిటీ కార్యదర్శి మరుపిళ్ళ హనుమంతరావు, గౌరవ అధ్యక్షులు బెవర సూర్యనారాయణ, శీరం వెంకట్రావు, పొట్నూరి రాజా ఇతర కమిటీ సభ్యులు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలను అందచేశారు. ఉత్సవ ఏర్పాట్లను కమిటీ సభ్యులు కామందుల నరసింహారావు, మజ్జి శ్రీనివాసరావు, మజ్జి ఈశ్వరరావు, పోతిన ధర్మారావు పర్యవేక్షించారు. భీమనవారిపేటలోని విజయదుర్గా రామలింగేశ్వర స్వామి ఆలయంలో అమ్మవారిని కాశీ అన్నపూర్ణాదేవిగా అలంకరించారు. అమ్మవారికి ఆలయ అర్చకులు చింతలపాటి వెంకట సుబ్రహ్మణ్యశాస్త్రి, పవన్‌కుమార్ శర్మ పూజలు నిర్వహించారు. పాలప్రాజెక్టు సమీపంలోని గంగానమ్మ దేవస్థానంలో అమ్మవారిని అన్నపూర్ణాదేవిగా అలంకరించారు. శ్రీదుర్గా గాయత్రి అర్చక యాగ్నిక పురోహిత సేవా సంఘం ఆధ్వర్యంలో ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాలను పురస్కరించుకుని అమ్మవారి దర్శనానికి విచ్చేసే భక్తులకు దేవస్థాన కమిటీ ప్రసాదాలను పంపిణీ చేస్తుంది. ఉత్సవ ఏర్పాట్లను ఆలయ ఫౌండర్ బసవ కాశీ విశ్వనాథ్, గౌరవ అధ్యక్షులు సుంకర వెంకటేశ్వరరావుతో పాటు దాతలు కుంచెం శ్రీనివాసరావు, బొమ్మిశెట్టి నాగేంద్ర, వై. వెంకటేశ్వర్లు, పట్నాల అప్పారావు, పిళ్లా ఏసుబాబు, తమ్మిన సతీష్‌కుమార్ దంపతులు సహాయ సహకారాలను అందిస్తున్నట్లు సేవా సంఘం అధ్యక్షులు విన్నకోట శ్రీనివాసరావు శర్మ పేర్కొన్నారు.

భవానీపురం(విజయవాడపశ్చిమ):భవానీపురం కోళ్లఫారం రోడ్‌లో నిర్వహిస్తున్న శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో బుధవారం అమ్మవారు శ్రీఅన్నపూర్ణా దేవిగా దర్శనమిచ్చారు. కుండల మార్కెట్ లోగల శ్రీ గంగా - దుర్గా - మారెమ్మ విశ్వేశ్వర స్వామి దేవస్థానంలో అమ్మవారు అన్నపూర్ణ దేవి అలంకారంలో దర్శనం ఇచ్చారు. ఊర్మిళా సుబ్బారావు నగర్ గ్రామ దేవత పోలేరమ్మ దేవస్థానంలో అమ్మవారు శ్రీబాలా త్రిపుర సుందరీ దేవి అలంకారంలో దర్శనం ఇచ్చారు. విద్యాధరపురం రోటరీనగర్‌లో నిర్వహిస్తున్న దసరా ఉత్సవాల్లో అమ్మవారిని అన్నపూర్ణా దేవిగా అలంకరించారు. విజయవాడ రూరల్ మండలం గొల్లపూడి గ్రామంలో ఉన్న అన్నపూర్ణా సమేత విశ్వేశ్వరస్వామి దేవస్థానం నిర్వహిస్తున్న దసరా శరన్నవరాత్రుల్లో భాగంగా బుధవారం అమ్మవారు శ్రీఅన్నపూర్ణా దేవిగా దర్శనం ఇచ్చారు.

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): కేటీరోడ్డులోని శ్రీనివాసమహల్ సెంటర్‌లో కొలువై ఉన్న గంగానమ్మ వారి దేవస్థానంలో అమ్మవారు అన్నపూర్ణాదేవిగా దర్శనమిచ్చారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలంపల్లి శ్రీనివాసరావు అమ్మవారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. చదునుమహాలక్ష్మమ్మ దేవస్థానంలో అమ్మవారు కాశీ అన్నపూర్ణాదేవి స్వరూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. భ్రమరాంబ మల్లేశ్వరస్వామి వారి దేవస్థానం (పాతశివాలయం)లో కొలువై ఉన్న అమ్మవారు గాయిత్రీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. వేంకటేశ్వరస్వామి వారి దేవస్థానంలో కొలువుదీరిన పద్మావతి అమ్మవారు గాయిత్రీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీ కృష్ణ ప్రార్థనామందిరంలో కొలువై ఉన్నకన్యకాపరమేశ్వరి అమ్మవారు అన్నపూర్ణాదేవిగా అలంకరించారు.దర్శేశ్వరస్వామి వార్ల దేవస్థానంలో కొలువై ఉన్న పార్వతీ అమ్మవారు అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.



గంగానమ్మ అమ్మవారి దేవస్థానంలో వెలంపల్లి శ్రీనివాసరావు



అమ్మవారిని దర్శించుకున్న మేయర్ భాగ్యలక్ష్మికి దేవస్థానం తరుపున జ్ఞాపిక అందజేస్తున్న కమిటీ



భవానీపురం కోళ్లఫారం రోడ్‌లో




అన్నపూర్ణాదేవిగా దర్శనమిస్తున్న గంగానమ్మ



అన్నపూర్ణాదేవిగా చదునుమహాలక్ష్మీ



గాయత్రిదేవిగా మహాలక్ష్మీ అమ్మవారు



విశ్వేశ్వర స్వామి దేవస్థానంలో




గాయిత్రీదేవిగా పద్మావతిదేవి



గొల్లపూడిలో అన్నపూర్ణా దేవిగా



రోటరీనగర్‌లో శ్రీఅన్నపూర్ణాదేవిగా అమ్మవారు



గాయత్రి దేవి అలంకారంలో పోలేరమ్మ



అమ్మవారికి ప్రత్యేక పూజలు

### నువ్వు నిజమైన పోలీసేనా?



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ):'నువ్వు నిజమైన పోలీసేనా.. నీకు ఐడీ కార్డు ఇచ్చింది ఎవరు.. ఐడీ కార్డులో ఉన్న ఫోటో నీది కాదే ... అరేయ్.. ఈ కార్డులు ఫోటో తీయండి.. చూద్దామంటూ' దేవాదాయ శాఖకు చెందిన ఈవో పోలీసు కానిస్టేబుల్‌తో ప్రవర్తించిన తీరు బుధవారం సర్వత్రా వివాదస్పదంగా మారింది.. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని మీడియా పాయింట్ వద్ద ఈ ఘటన చోటు చేసుకుంది. దసరా ఉత్సవాల్లో భాగంగా దేవదాయ శాఖకు చెందిన తలుపులమ్మ లోవ దేవస్థాన ఈవో మీడియా పాయింట్ గేట్ వద్ద విధులు నిర్వహిస్తున్నారు. వన్‌టౌన్‌కు చెందిన కానిస్టేబుల్ పోలీసు శాఖకు చెందిన నలుపురు వ్యక్తులతో మీడియా పాయింట్ గేట్ వద్దకు వచ్చారు. అయితే ఎవరి తాలుకా అని ఈవో ప్రశ్నించడంతో విషయం చెప్పాడు. తొలుత ఇద్దరు వ్యక్తులను లోపలకు పంపిన తర్వాత మిగిలిన ఇద్దరిని కూడా పంపాలని కోరగా, నీవ్వు ఎన్ని సార్లు తిరుగుతావు...అసలు ఎవరు నువ్వు అంటూ కానిస్టేబుల్ మెడలో ఉన్న దసరా ఉత్సవాల గుర్తింపు కార్డు, పోలీస్ ఐడీ కార్డులను పరిశీలించారు. తాను వన్‌టౌన్ స్టేషన్‌లోనే విధులు నిర్వహిస్తున్నానని చెప్పినా ఈవో వినకుండా కానిస్టేబుల్ మెడలో ఉన్న ఐడీకార్డులను బలంగా లాగుతూ తనతో ఉన్న సిబ్బందితో వీడియోలు, ఫోటోలు తీయాలని సూచించారు. అయితే ఈ వ్యవహారంతో కంగుతిన్న కానిస్టేబుల్ ఏం మాట్లాడాలో అర్థంకాక అలాగే నిల్చుండిపోయాడు. ఇంతలో ఆలయ ప్రాంగణంలో విధుల్లో ఉన్న మిగిలిన పోలీసు సిబ్బందికి విషయం తెలిసే సరికి అందరూ అక్కడకు చేరుకున్నారు. వెంటనే జరిగిన సంఘటన గురించి వన్‌టౌన్ సీఐ గురు ప్రకాష్ దృష్టికి తీసుకువెళ్లడంతో ఆయన పాయింట్ వద్దకు చేరుకున్నారు. వెంటనే ఈ విషయాన్ని సీఐ దుర్గగుడి ఈవో శీనానాయక్ దృష్టికి తీసుకువెళ్లారు.

### అమ్మవారిని దర్శించుకున్న డెప్యూటీ స్పీకర్

వించిపేట(విజయవాడపశ్చిమ):దుర్గామల్లేశ్వర స్వామి వార్ల దసరా మహోత్సవాలలో భాగంగా బుధవారం ఇంద్రకీలాద్రిపై కొలువైయున్న జగన్మాత శ్రీ అన్నపూర్ణా దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. రాష్ట్ర శాసనసభ ఉప సభాపతి కనుమూరి రఘురామ కృష్ణంరాజు దంపతులు అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం మీడియా పాయింట్‌లో మాట్లాడుతూ దసరా మహోత్సవాల ఏర్పాట్లు సంతృప్తికరంగా ఉన్నాయన్నారు.

# వీఐపీల సేవలోనే అధికార యంత్రాంగం!

- పాసులు లేకున్నా నేరుగా రాజగోపురం వరకూ దూసుకొస్తున్న వాహనాలు
- సామాన్య భక్తుల దర్శనానికి తప్పని ఇబ్బందులు
- సామాన్యులకు పెద్దపీట అంటున్నా ఆచరణలో కానరాని వైనం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ):దుర్గమ్మ దసరా ఉత్సవాల్లో వీఐపీల సేవలోనే అధికార యంత్రాంగం పూర్తిగా తరిస్తుంది. ఇంద్రకీలాద్రిపై కొలువున్న కనకదుర్గమ్మ దసరా ఉత్సవాల్లో సామాన్య భక్తులకే పెద్దపీట అంటూ పదేపదే ప్రకటిస్తున్నా అది ఆచరణలో కానరావటం లేదు. ప్రముఖులు, వీఐపీలంటూ కూటమి నేతలు, వారి తాలుకా బంధువులతో దుర్గగుడి ప్రాంగణమంతా నిండిపోతుంది. వారి సేవలోనే అధికాయ యంత్రాంగం నిమగ్నమై సాధారణ భక్తుల సేవలను విస్మరిస్తుందనే విమర్శలు వినిపిస్తున్నాయి. గడిచిన మూడునాలుగు మాసాల నుంచి నిర్వహించిన ప్రతి సమావేశంలోనూ సామాన్య భక్తులకు ఇబ్బందులు లేకుండా చూస్తామంటూ ప్రకటించిన అధికారులు వీఐపీలు, ప్రముఖుల పేరుతో కూటమి నేతల తాలుకా బంధుగణాన్ని దర్శనాలు చేయించటంలో నిమగ్నమవుతున్నారు.

#### కొండపై గందరగోళ పరిస్థితులు

దుర్గమ్మ సన్నిధిలో రెండో రోజూ ఉదయం నుంచి సాయంత్రం వరకూ వీఐపీలంటూ పెద్ద సంఖ్యలో జనం వీఐపీ క్యూలైన్‌లోకి, రాజగోపురం వద్దకు తోసుకొచ్చారు. దీంతో ఆలయ ప్రాంగణంలో గందరగోళ పరిస్థితులు తలెత్తాయి. వీఐపీలకు ప్రత్యేక సమయం అంటూ కేటాయించి అప్పుడే రావాలంటూ ప్రచారం సైతం చేశారు. కానీ ఆ నియమాలు ఏమి అమలు కావటం లేదంటూ ఆలయ సిబ్బంది చెబుతున్నారు. మంగళవారం పెద్ద సంఖ్యలో వీఐపీలు, ప్రముఖుల పేరుతో కూటమి నేతల బంధుగణం తరలిరావటంతో సాధారణ భక్తులు తీవ్ర ఇబ్బందులెదుర్కొన్నారు.

#### ఒకవైపు కలెక్టర్, సీపీలు పరిశీలనలు

జిల్లా కలెక్టర్ లక్ష్మీశా, పోలీస్ కమిషనర్ రాజశేఖరబాబులు ఇంద్రకీలాద్రితో పాటుగా పరిసర ప్రాంతాల్లో మంగళవారం పర్యటించారు. కలెక్టర్ దంపతులు సాధారణ భక్తులతో క్యూలైన్‌లోనే అమ్మవారి దర్శనం చేసుకున్నారు. అలాగే కొండ దిగువకు వచ్చిన అన్నదానం చేస్తున్న ప్రాంగణంలో అన్నప్రసాదాన్ని సైతం స్వీకరించారు. మరోవైపు వీఐపీల ముసుగులో కూటమి నేతల హడావుడి కొనసాగటం అధికారులకు సైతం తలనొప్పిగా మారింది. కొండపై ఉన్న అధికారులు జనం తోసుకురావటంతో ఏమి చేయలేక చేతులెత్తేసే పరిస్థితులు దాపురించాయి. దసరా ఉత్సవాల్లో ఇంద్రకీలాద్రిపైకి వాహనాలు రావాలంటూ తప్పనిసరిగా పాస్‌లు ఉండాలి. పాస్‌లు ఉన్న వాహనాలను మాత్రమే ఘాట్‌రోడ్డు మీదకు అనుమతిస్తారు. అలాగే ఆ వాహనాలను ఓంటర్నింగ్ వరకూ రానిస్తారు. వీవీఐపీల వాహనాలను మాత్రం సమాచార కేంద్రం వరకూ అనుమతిస్తారు. కానీ రాజకీయ నాయకులకు సంబంధించిన పలు వాహనాలను ఎటువంటి పాస్‌లు లేకున్నా సమాచార కేంద్రాన్ని దాటి దూసుకురావటంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. ఆ విధంగా కార్లు దూసుకురావటంతో సామాన్య భక్తులు, సిబ్బంది రాకపోకలకు సైతం ఇబ్బందులు తలెత్తుతున్నాయి.



భక్తులతో కిటకిటలాడుతున్న క్యూలైన్లు

#### అత్యవసరానికీ అవస్థలే....

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్):ఇంద్రకీలాద్రిపై వేంచేసి ఉన్న శ్రీదుర్గామల్లేశ్వరస్వామి వారి దేవస్థానంలో జరుగుతున్న శ్రీదేవి శరన్నవరాత్రి మహోత్సవాలకు విచ్చేస్తున్న భక్తులు 'అత్యవసరానికీ' అవస్థలు పడాల్సివస్తుంది. అమ్మవారి దర్శన అనంతరం కొండ కింద భాగంలో కనకదుర్గానగర్ మీదుగా విచ్చేస్తున్న భక్తులకు ఎక్కడా ప్రజా మరుగుదొడ్లు కనిపించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రధానంగా మహిళల ఆత్మ గౌరవానికి ప్రతీకగా చెప్పుకునే ప్రజా మరుగుదొడ్లు లేకపోవడంతో మహిళా భక్తులు, వృద్ధులు, చిన్నపిల్లలు నరకయాతన పడుతున్నారు.అమ్మవారి దర్శనాల కోసం కొండపైకి క్యూలైన్లలో వెళ్లే భక్తులు కిందకు రావడానికి సుమారు గంటకు పైనే సమయం పడుతుంది. ఇక చంటిపిల్లలు, వృద్ధులతో వచ్చే వారికి రెండు గంటల పైమాటే. కిందకు వచ్చే మెట్ల మార్గంలో అన్నప్రసాద వితరణ కేంద్రంతో పాటు కొబ్బరికాయలు కొట్టే ప్రదేశము, లడ్డూ ప్రసాదాల కౌంటర్లు వరుసగా ఉన్నాయి. ఇక్కడ అమ్మవారి అన్నప్రసాదం స్వీకరించాలని భక్తులందరికీ ఆశ ఉంటుంది. ఆ ప్రసాదం స్వీకరించి లడ్డూప్రసాదాల వద్దకు వచ్చి కొనుగోలు చేయడంతో మొత్తం మరో గంట సమయం పడుతుంది. ఇలా అమ్మవారి దర్శనం తరువాత మూడు గంటల పాటు వేచి ఉండాల్సిన ప్రదేశంలో అధికారులు మరుగుదొడ్లు ఏర్పాటుచేయకపోవడంపై భక్తుల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.





గుంటూరు జిల్లా తాడేపల్లిలోని వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం ఉదయం పార్టీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పార్టీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలంపల్లి శ్రీనివాసరావు, సెంట్రల్ నియోజకవర్గ ఇన్‌చార్జి మల్లాది విష్ణు, మైలవరం ఇన్‌చార్జి జోగి రమేష్, పార్టీ నాయకులు పోతిన మహేష్ తదితరులు పాల్గొన్నారు. – సాక్షి నెట్ వర్క్

### కత్తితో దాడి చేసిన వ్యక్తిపై కేసు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): మహిళపై కత్తితో దాడిచేసిన వ్యక్తిపై భవానీపురం పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. ఆర్టీసీ వర్క్‌షాపునకు చెందిన కందుకూరి లక్ష్మీదేవి ఇళ్లలో పని చేస్తూ జీవనం సాగిస్తోంది. భర్త తనను విడిచి వెళ్లిపోవడంతో పిల్లలతో కలిసి తన తండ్రి వద్ద ఉంటుంది. గత ఐదు నెలల నుంచి లారీ డ్రైవర్ అప్పారావు ఆమె వెంట పడుతున్నాడు. తను అంటే ఇష్టమని, పెళ్లి చేసుకుంటానని, పిల్లల్ని చూసుకుంటానని వెంట పడుతున్నాడు. అందుకు ఆమె నిరాకరించింది. ఈ విషయం తన తండ్రికి తెలియజేసింది. ఆ సమయంలో ఇద్దరికి మధ్య గొడవ జరిగింది. అయినప్పటికీ అప్పారావు వేధింపులు ఆగలేదు. ఈ నేపథ్యంలో మంగళవారం రాత్రి ఆర్టీసీ వర్క్‌షాపు రోడ్డులో నడుచుకుంటూ వస్తుండగా అప్పారావు అక్కడ మాటు వేసి ఆమెపై కత్తితో దాడి చేసి గొంతు కోశాడు. దీంతో ఆమె అరవడంతో అతను పారిపోయాడు. రక్తం మడుగులో ఉన్న ఆమెను ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితురాలు ఇచ్చిన స్టేట్‌మెంట్ ఆధారంగా అప్పారావు పై కేసు నమోదు చేశారు.